ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం


జిల్లా వార్తలు

శుక్రవారం 24 మే 2024



కౌంటింగ్‌పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమీక్ష

అరసవల్లి: కౌంటింగ్ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పటిష్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండాలని ఆయన అన్నారు. ఈ సమీక్షలో జిల్లా నుంచి కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు హాజరయ్యారు. కలెక్టర్.. ఓట్ల లెక్కింపు వివరాలను, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలను వివరించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు.



ఒడిశా రోడ్డు..

రోడ్డు బాగుంటే ఒడిశా.. గతుకులు ఉంటే ఆంధ్రా

గతంలో రోడ్డు బాగుంటే ఆంధ్రా.. గతుకులు ఉంటే ఒడిశా రాష్ట్రంగా వాహనదారులు గుర్తించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇది రివర్స్ అయింది. గతుకుల రోడ్డు వస్తే ఆంధ్రా.. బాగున్న రోడ్డు కనిపిస్తే ఒడిశా అని గుర్తించవలసిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుగల పట్టుపురం-కొత్తపల్లి రోడ్డులో లావణ్య కోట వరకు.. ఒడిశా రోడ్డు జాతీయ రహదారిని తలపిస్తే.. సరిహద్దు దాటితే మాత్రం పెద్దపెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్ల నుంచి ఏపీ ప్రభుత్వం ఈ రోడ్డు గురించి అస్సలు పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు చేరి అవి ఎంతలోతు ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. తద్వారా కొన్నిసార్లు వాహనదారులు గుంతల్లో పడి గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. లావణ్య కోట సరిహద్దు నుంచి గొప్పిలి వరకు 3 కిలోమీటర్లు పూర్తిగా గుంతలమయం కావటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే ఇటీవల రూ.25 లక్షలు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నా పనులు మాత్రం కాలేదు.

-మెళియాపుట్టి



ఆంధ్రా రోడ్డు..

మరో చెరవు!

- తండేంవలసలో చెరువు గర్భం ఆక్రమణ
- హెచ్చరిక బోర్డును తొలగించి నిర్మాణాలు
- లీజు పేరుతో దళితుల భూముల స్వాధీనం
- తెరవెనుక కథ నడిపిస్తున్న వైసీపీ నేత
- ఆక్రమణలు వాస్తవమేనంటున్న అధికారులు





అది పోరంబోకు స్థలమని అధికారులు నిర్ధారించారు. హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నేతలు కదా.. ఆ దర్పంతో వారు బోర్డును తొలగించారు. ఆ స్థలం ఆక్రమించేందుకు యత్నించారు. అధికారులు మళ్లీ జోక్యం చేసుకోవడంతో అప్పటికి మిన్నకుండిపోయారు. ఇప్పుడంతా యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నమైంది. అంతే.. అక్రమార్కులు ఇదే అదనుగా భావించారు. 20 సెంట్ల స్థలంలో గదుల నిర్మాణం చేపట్టారు. మరికొందరు ఎకరా పది సెంట్ల చెరువు గర్భాన్ని చదును చేసి ఆక్రమణకు సిద్ధమయ్యారు.

- శ్రీకాకుళం క్రైం

ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. కొందరు వైసీపీ నేతలు అక్కడ వాలిపోతున్నారు. కబ్జాకు తెగబడుతున్నారు. తమ అనుచరులనో.. బంధువులనో రంగంలోకి దింపుతున్నారు. చెరువు గర్భంలో ఉన్న భూమైతే ఇంక అడగనవసరం లేదు. మొన్న సింగుపురం చెరువు అన్యాక్రాంతం ఉదంతం మరువక ముందే.. తండేంవలస గ్రామంలో ఉన్న చెరువు గర్భాన్ని ఆక్రమించిన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలసలోని సర్వే నెంబర్ 94లో చెరువు గర్భం (డి-పట్టా) భూమిని స్థానిక వైసీపీ నేత అండదండలతో ఆక్రమణలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమిని గత ఏడాది కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో గ్రామస్థులు దీనిపై తహసీల్దార్‌కు, సచివాలయ అధికారులకు, కలెక్టర్ స్పందనకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ వెంకటరావు, అప్పటి ఆర్డీవో శాంతి తండేంవలసలో పర్యటించి.. చెరువు గర్భం ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అది పోరంబోకు స్థలమని.. ఎవరూ ఆక్రమించకూడదని హెచ్చరిస్తూ 2023 జూన్‌లో బోర్డును ఏర్పాటు చేశారు. అదే ఏడాది నవంబరు నెలలో ఆ హెచ్చరిక బోర్డును కొందరు తొలగించి.. మరోసారి ఆక్రమణకు ఉపక్రమించారు. అప్పుడు అధికారులు కలుగజేసుకోవటంతో ఆక్రమణలు నిలిచిపోయాయి. ఇటీవల సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఎన్నికల విధులలో ఉండడాన్ని గమనించి అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సర్వే నెంబర్ 94లో 10 నుంచి 20 సెంట్ల స్థలంలో గదుల నిర్మాణం చేపట్టారు. మరికొందరు అదే సర్వే నెంబర్‌లో ఎకరా పది సెంట్లు చెరువు గర్భాన్ని చదును చేసి ఆక్రమణకు సిద్ధమయ్యారు. దీంతో గ్రామస్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.



94 సర్వే నెంబర్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు



2023లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఇది. దీన్ని కూడా అక్రమార్కులు తొలగించారు.



ఆక్రమణదారులు చదును చేసిన ఎకరా స్థలం

లీజు పేరుతో...

సర్వే నెంబర్ 94లో కొంత భూమి దళితుల సాగులో ఉంది. ఆ భూమిని కొందరు వారి నుంచి 99 ఏళ్లకు లీజు పేరుతో తీసుకుంటూ ఒప్పందం చేసుకున్నారు. వారి నుంచి కొనుగోలు చేసినట్లు పత్రాలు సిద్ధం చేసుకున్నారు. దళితుల సాగులో ఉన్న భూమి అమ్మకానికి గానీ లీజుకు తీసుకోవ డానికీ కానీ చెల్లదు. కానీ కొందరు లీజు ఒప్పందం రాయించుకున్నారు. ఇలా కొంత భూమి ఆక్రమణకు గురైంది.

నోటీసులు అందినా...

తండేంవలసలో 94 సర్వే నెంబర్‌లో భూ ఆక్రమణకు పాల్పడ్డారంటూ ముగ్గురు వ్యక్తులకు సచివాలయ సెక్రటరీ సుప్రజ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. వారు ఆ నోటీసులను బేఖాతరు చేస్తూ ఆక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న వైసీపీ నేత ప్రోత్సాహంతో భూ ఆక్రమణ కొనసాగుతోంది.

వాస్తవమే..

తండేంవలసలో సర్వే నెంబర్ 94లో ఉన్న పోరంబోకు, చెరువు గర్భం భూములను కొందరు ఆక్రమించుకోవడం వాస్తవమేనని ఈవో పీఆర్‌డీ ప్రకాశరావు తెలిపారు. గతం లో తహశీల్దారు సహకారంతో అక్కడ నోటీసు బోర్డు పెట్టామని చెప్పారు. ఇప్పటికే ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పటికీ కొందరు ఆక్రమణదారులు భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని వివరించారు. రెవెన్యూ అధికారులు గ్రామంలో పోరంబోకు, శ్మశాన స్థలం, చెరువు గర్భాలను గుర్తించి... వాటి వివరాలు అందించాల్సి ఉందని చెప్పారు.

చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలు..

- పట్టని ఈవో, పంచాయతీ కార్యాలయ సిబ్బంది
- తొలగించకుంటే ఉద్యమిస్తాం: టీడీపీ నాయకులు

నరసన్నపేట, మే 23: స్థానిక సంతతోట పల్లిపేట రోడ్డులో స్నానాలు రేవు వద్ద చెరువు గట్టును కొందరు ఆక్రమించారు. రాత్రి సమయంలో భవనాల నిర్మాణం చేపడుతున్నారు. అధికార పార్టీ నాయకులు అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అక్కడ కొందరు పేదలు గుడిసెలు వేసుకుని ఉంటే.. వారి నుంచి ఆ ప్రాంతాన్ని కొందరు అధికారపార్టీ నాయకులు బలవంతంగా తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈవో, పంచాయతీ అధికారులకు ఈ నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. స్నానాల రేవు వద్ద అక్రమ నిర్మాణాలను తొలగించకుంటే ఉద్యమిస్తామని తెలుగుయువత నాయకులు రావాడ గణపతిరావు, చలపాక మల్లేశ్వరరావు హెచ్చరించారు. కొందరు అధికారులు అధికారపార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని టీడీపీ నాయకుడు గణపతిరావు అన్నారు. ఈవిషయమై తహసీల్దార్ కనకరావు వద్ద ప్రస్తావించగా అక్రమ నిర్మాణాల విషయం తన దృష్టికి రాలేదన్నారు.



గోరువానిచెరువు గట్టు చదును చేసి అక్రమ నిర్మాణాలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- లెక్కింపులో ఆర్వోలు, సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం
- శిక్షణ శిబిరంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 23: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ నిబంధనలపై ఆర్వోలు, ఏఆర్వోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, లెక్కింపు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. గురువారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఆర్వో, ఏఆర్వోలకు కౌంటింగ్ నిర్వహణపై నిర్వహించిన ఒక రోజు శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆర్వోలు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులు సమన్వయంతో పనిచేయాలయని, ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో డిక్లరేషన్‌పై సంతకం ఉన్నదీ లేనిదీ పరిశీలించాలన్నారు. లెక్కింపు ప్రక్రియలో రిటర్నింగ్ అధికారు లు, సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్వోలు నూరుల్ కమర్, సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శనదొర, అప్పారావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, డీపీవో వేంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, ట్రైనర్లు కిరణ్ కుమార్, ఎస్.బాలాజీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, శేషగిరి, తహసీల్దార్లు హాజరయ్యారు.



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఎస్పీ

స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై అర్ధరాత్రి ఎస్పీ తనిఖీ

శ్రీకాకుళం క్రైం/ఎచ్చెర్ల, మే 22: కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తుండటంతో స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను బుధవారం అర్ధరాత్రి ఎస్పీ జీఆర్ రాధిక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎచ్చెర్ల శివానీ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. భద్రత, గార్డుల విధులు, రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారం, పాత నేరస్థులపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

ముగిసిన ఏపీ ఈఏపీ సెట్

- 94.24 శాతం మంది హాజరు

ఎచ్చెర్ల, మే 23: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, వెటర్నరీ సైన్స్, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2024 గురువారం ముగిసింది. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంటు (టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)లో ఈ నెల 16వ తేదీ నుంచి ఈ పరీక్షలు జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానంలో జరిగాయి. మొదటి రెండు రోజులు బైపీసీ స్ట్రీమ్‌లో జరగగా.. 4,060 మంది అభ్యర్థులకు 3,754 మంది హాజరయ్యారు. 306 మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 18 నుంచి ఆరు రోజుల పాటు ఎంపీసీ స్ట్రీమ్‌లో పరీక్షలు జరగగా... 9,346 మందికి గాను 8,881 మంది హాజరయ్యారు. 465 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో కలిపి బైపీసీ, ఎంపీసీ స్ట్రీమ్‌ల్లో 13,406 గాను 12,635 మంది పరీక్ష రాశారు. 771 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఏపీ ఈఏపీ సెట్‌కు 94.24 శాతం మంది హాజరయ్యారు.

వంశధార.. కన్నీటిధార

- ఆధునికీకరణకు నోచుకోని ప్రధాన కాలువ
- దుర్భిక్షంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకోని వైనం



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో వంశధార నీరు కలిసే ప్రాంతంలో డంపింగ్ యార్డుగా మారిన దృశ్యం

పలాస, మే 23: వంశధార కాలువ వచ్చిందన్న సంతోషం రైతులకు ఎప్పుడూ లేదు. కాలువ నిర్మించిన తరువాత ఐదేళ్లపాటు పంట పొలాలకు నీరు అందింది. ఆతర్వాత నిర్వహణ లేకపోవడంతో కాలువ కుంచించుకుపోయింది. ప్రస్తుతం వంశధార నీరు విడుదలయ్యే గొట్టా బ్యారేజి వద్ద భారీ స్థాయిలో వరద వస్తేనే దిగువకు నీరు అందుతుంది. లేకుంటే ఆ ఏడాది రైతులు దుర్భిక్షాన్ని అనుభవించాల్సిందే. పలాస నియోజకవర్గంలో వంశధార కాలువ ద్వారా పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సుమారు 9 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. వంశధార నీరు వర్షాకాలంలో విడుదలైతే చెరువులను నింపి.. ఆ నీటిని రెండు మండలాల ప్రజలు సాగు అవసరాలకు వినియోగించుకుంటారు. అయితే నీరు ఎప్పుడు వస్తుందో అన్నది ప్రశ్నార్థకమే. పలాస మండలం టెకలిపట్నం గ్రామం నుంచి నందిగాం మండలం మీదుగా ప్రవేశించి వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి వరకు 18 కిలోమీటర్ల కాలువ ప్రవహిస్తుంది. ఆయా ప్రాంతాల్లో చెరువులు ముందుగా నింపి తరువాత పిల్ల కాలువల ద్వారా పంటలకు నీరు అందుతుంది. అయితే కాలువకు మరమ్మతులు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా రైతులకు నీరు సక్రమంగా అందడం లేదు. వర్షం వస్తేనే వంశధార నీరు వస్తుందని, ఆ సమయంలో నీరు వచ్చినా ప్రయోజనం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపినా..

కాలువకు ప్రధానంగా షట్టర్లు, లెవెలింగ్, పూడిక తీయడం, జంగిల్ క్లియరెన్స్ వంటివి చేయడంతో పాటు పిల్ల కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రతిఏటా వంశధార అధికారులు ప్రతిపాదనలు వేసినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కూడా వంశధార కాలువ ఆధునికీకరణకు మోక్షం లభించలేదు. దీంతో వచ్చే కొత్త ప్రభుత్వంలోనైనా వంశధార గురించి పట్టించుకుంటారన్న ఆశాభావంతో రైతులు ఉన్నారు. పలాస ప్రాంతంలో దేశబట్టి ఛానల్-వంశధార కలిసే ప్రాంతంలో కాలువ స్వరూపమే మారిపోయింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన మురుగునీరంతా కాలువలో చేరి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. దీనివల్ల నీరు విడుదలైనా ప్రయోజనం ఉండడం లేదు. అలాగే మురుగునీరు వంశధార కాలువలో కలవడం వల్ల సమీపంలోని ప్రధాన చెరువులు కలుషితమవుతున్నాయి.




ఈదురాపల్లి గ్రామం వద్ద మరమ్మతులకు నోచుకోని వంశధార కాలువ



దేవీ ఆశ్రమంలో శ్రీచక్రాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల, మే 23: కుంచాల కురమయ్య పేటలోని దేవీ ఆశ్రమంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపారు. భక్తులచే శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు చేయించారు. అలాగే మహామేరువుకు హారతినిచ్చారు.



ఘనవిజయం సాధించాలి

అల్లు అరవింద్



ఆశిష్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం చిత్రబృందం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి. 'లవ్ మీ' టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని అన్నారు. "లవ్ మీ' డిఫరెంట్ సినిమా. ఈ చాలెంజింగ్ స్క్రిప్ట్‌ను అరుణ్ తెరకెక్కించిన విధానం సూపర్బ్. కొత్తదనాన్ని కోరుకునే ప్రేక్షకులకి ఈ సినిమా తప్పక నచ్చుతుంది" అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ "ఈ సినిమాతో దర్శకుడు అరుణ్ నాన్ లీనియర్ నేరేషన్‌కు కొత్త నిర్వచనం ఇచ్చారు" అని అన్నారు. చిత్ర దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కిల్ మీ ఇఫ్ యు డేర్' వస్తుంది" అని చెప్పారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమా సక్సెస్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సంగీత దర్శకుడు కీరవాణి, సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ వంటి దిగ్గజాలు ఈ సినిమాకు వర్క్ చేయటంతో లక్కీగా ఫీలవుతున్నాం" అని చెప్పారు.

రాజు యాదవ్ ఓ ఎమోషనల్ రైడ్



టెలివిజన్ కామెడీ షో 'జబర్దస్త్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు గెటప్ శ్రీను. తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఆయన.. మంచి కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల మనుసులు గెలుచుకుని పాపులర్ కమెడియన్‌గా మారారు. ఆయన తొలిసారి హీరోగా నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఫన్, ఎమోషనల్ రైడ్‌గా తెరకెక్కిన 'రాజు యాదవ్' ఈ రోజే విడుదలవుతున్న సందర్భంగా హీరో గెటప్ శ్రీను మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు నన్ను కలిసినప్పుడు మొదట నా పాత్ర గురించి చెప్పారు. భలే అనిపించింది. ఆ తర్వాత కథ వినగానే వెంటనే ఒప్పేసుకున్నా. ఈ కథను డైరెక్టర్ వాస్తవ సంఘటనల ఆధారంగా రాసుకున్నా.. క్యారెక్టర్ మాత్రం కల్పితమే. నేను ఇప్పటి వరకు చేసిన పాత్రల్లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది ఇదే. ఎప్పుడూ నవ్వుతూ ఉండటం మామూలు విషయం కాదు. కొన్ని సందర్భాల్లో ఈ పాత్రలో వంద శాతం ఇవ్వలేనేమోనని.. ఒక ఆర్టిస్ట్‌గా ఫెయిల్ అయిపోతానేమో అని అనుకున్న సందర్భాలూ ఉన్నాయి. అటువంటి సమయాల్లో దర్శకుడే నన్ను సపోర్ట్ చేశారు. ఈ సినిమాను దర్శకుడు కృష్ణమాచారి చాలా సహజంగా తెరకెక్కించారు. ప్రస్తుత తరం ప్రేక్షకులు రియలిస్టిక్ సినిమాలనే ఇష్టపడుతున్నారు. ఈ సినిమా కూడా సహజత్వం కోరుకునే ప్రేక్షకులందరికీ తప్పక నచ్చుతుంది" అని చెప్పారు.

'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ఇళయరాజా లీగల్ నోటీసులు



మలయాళ బ్లాక్‌బస్టర్ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. కారణం 'గుణ' చిత్రం కోసం ఇళయరాజా స్వరపరిచిన 'కమ్మని ఈ ప్రేమ లేఖలే' పాటను ఈ సినిమాలో వాడడమే. అనుమతి తీసుకోకుండా, రాయల్టీ ఫీజు చెల్లించకుండా ఇలా పాటను ఉపయోగించడం కాపీరైట్ చట్టాన్ని అతిక్రమించినట్లేనని ఇళయరాజా లాయర్ శరవణన్ అన్నాదురై నిర్మాతలకు పంపించిన నోటీసులో హెచ్చరించారు. ఈ విషయంపై 15 రోజుల్లో నిర్మాతలు తగిన విధంగా స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని ఆయన తెలిపారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న 'కూలీ' సినిమాలోనూ తను సంగీతం అందించిన 'తంగా మగన్'(1983) చిత్రంలోని 'వా వా పక్కమ్ వా' పాటను కూడా అనుమతి లేకుండా వాడారని ఇళయరాజా, నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్‌కు ఈ నెల 2న నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

దర్శకుడిగా మరో కొరియోగ్రాఫర్




పలు చిత్రాలకు కొరియోగ్రఫీ నిర్వహించిన సతీశ్‌రాజ్ దర్శకుడవుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఎస్.ఆర్. మూవీ జంక్షన్ బేనరుపై ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సంస్థ లోగోను సీనియర్ నటుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. తన ఇష్టదైవం సాయిబాబా కావడంతో 'శ్రద్ధ.. సబూరి' పేరుతో రూపొందించిన పాటను కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ, నిర్మాత దామోదర ప్రసాద్ రిలీజ్ చేశారు. మూడు నిముషాల పాటలో మొత్తం కథ అర్థమయ్యేలా చూపించే దర్శకుడే కొరియోగ్రాఫర్ అనీ, ప్రతిభావంతుడైన సతీశ్‌రాజ్ దర్శకుడిగా మారడం ఆనందదాయకం అనీ మురళీమోహన్ చెప్పారు. సభలో పాల్గొన్న అతిథులందరూ దర్శకుడిగా కూడా సతీశ్‌రాజ్ విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శిరీష, నిర్మాత అర్చన కూడా పాల్గొన్నారు.

కొత్త తేదీన సత్యభామ



కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'సత్యభామ'. ఇందులో ఆమె శక్తిమంతమైన పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. జూన్ 7న 'సత్యభామ'ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క స్ర్కీన్‌ప్లే అందించడంతో పాటు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: బి విష్ణు









ఆరంభ శూరత్వం.. ఆచరణలో జాప్యం

● ఒకే భవనం నిర్మాణం పూర్తి ● ఇదీ ఆమదాలవలస నియోజకవర్గంలో డిజిటల్ గ్రంథాలయాల పరిస్థితి



సరుబుజ్జిలి మండలం షలంత్రిలో ఖాళీగా ఉన్న డిజిటల్ గ్రంథాలయం స్థలం

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో ఆరంభ శూరత్వం, ఆచరణలో జాప్యంలా డిజిటల్ గ్రంథాలయాల పరిస్థితి తయారైంది. కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడంతో భవన నిర్మాణాల ప్రక్రియ ముందుకుసాగడం లేదు.ఈ పరిస్థితుల్లో గ్రామీణ నిరుద్యోగులు, విద్యార్థులకు జగనన్న డిజిటల్ గ్రంథాలయాలు అందని ద్రాక్షగానే మిగిలాయి.

పాత భవనాలకు మరమ్మతులే లేవు..

2019 ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటుచేస్తామని నిరుద్యోగ యువతకు సీఎం జగన్ ఇచ్చిన హామీ అటకెక్కింది. వైసీపీ పాలన ఐదేళ్ల పూర్తయినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. సీఎం జగన్‌తోపాటు వైసీపీ నాయకులకు కూడా డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటుపై ఊదరగొట్టే ప్రసంగాలు ఇచ్చినా ఆచరణపై ఎటువంటి శ్రద్ధచూపకుండా గాలికి వదిలివేశారు. కొత్త డిజిటల్ గ్రంథాలయాల మాట ఎలా ఉన్నా, ఆమదాలవలస నియోజక వర్గంలో ఉన్న ప్రాత గ్రంథాలయ భవనాల మరమ్మతులు కూడా నోచుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి..

నియోజకవర్గంలోని పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మం డలాల్లో 28 డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటుతోపాటు భవన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయి. వీటిలో ఒకే భవన నిర్మాణం పూర్తయ్యింది. పది భవన నిర్మాణాలు వివిధ స్థాయిలో ఉన్నాయి. ఎనిమిది భవన నిర్మాణాల పనులు ప్రారంభంకాలేదు. మరో తొమ్మిది డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణాలకు స్థల సమస్య పట్టిపీడిస్తోంది. ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా ఒక్కో డిజిటల్ గ్రంథాలయం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 లక్షల రూపాయలు కేటాయించింది. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురాకపోవడంతో భవన నిర్మాణాల ప్రక్రియ ముందుకుసాగడంలేదు. ఇప్పటికే గ్రామ సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మాణాలు చేపట్టి బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. మళ్లీ డిజిటల్ గ్రంథాలయం భవన నిర్మాణాలు చేపట్టి చేతిచమురు వదలించుకోలేమని పేర్కొని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

కల్పించాల్సిన సదుపాయాలు..

డిజిటల్ గ్రంథాలయాల్లో నిరుద్యోగ యువత విద్యార్థులకు కంప్యూటర్లు ఇంటర్నెట్ ప్రింటర్‌లో స్కానర్లు, బల్లల కుర్చీలు, ఇనుప అరలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, పుస్తకాలు ఉంచేందుకు అనువుగా భవనం నిర్మించాలి. 50 నుంచి 60 మంది కూర్చొనేలా వసతులు కూడా ఈ డిజిటల్ గ్రంథాలయంలో ఏర్పాటు చేయాల్సిఉంది. అయితే డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో వివిధ పోటీ పరీక్షలకు హాజరవుతున్న నిరుద్యోగులు పట్టణాల్లోఉన్న శిక్షణ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. డిజటల్ గ్రంథాలయాల భవన నిర్మాణాల విషయంలో ప్రభుత్వం జాప్యం చేసి నిరాశకు గురిచేస్తోందని నిరుద్యోగులు యువకులు వాపోతున్నారు.

పలాసలో వజ్జ బాబూరావు జన్మదిన వేడుకలు



అభిమానుల మధ్య కేక్‌కట్ చేస్తున్న బాబూరావు

పలాస: పలాసలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుంచి భారీసంఖ్యలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల మధ్య కేకు కటింగ్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వజ్జ గంగాభవాని, టీడీపీ పట్టణాధ్యక్షుడు బడ్డ నాగరాజు, జిల్లాకార్యనిర్వాహక కార్యదర్శి గాలికృష్ణారావు, గురిటి సూర్యనారాయణ,టంకాల రవిశంకర్‌గుప్తా, క్యాజులేబర్‌అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, జోగ మల్లి, దొక్కరి శంకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

108 సేవలు విస్తృతం చేయాలి: డీఏవో

పలాస: 108 అంబులెన్స్ సేవలు విస్తృతం చేయాలని డివిజనల్ ఆపరేషన్ అధికారి(డీఏవో) జి.జగన్నాథరావు కోరారు.గురువారం పలాస 108 అంబులెన్స్ సేవలను పరిశీలించారు.నిర్వహణతీరు,పరికరాల వినియోగం, అత్యవస సేవల రికార్డులు, డ్యూటీచార్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో ఆస్పత్రులకు తరలించివారికి న్యాయంచేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది కేపీ సత్యం, ఎస్.వెంకటరావు, శ్రీనివాసరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

●**వజ్రపుకొత్తూరు:** వజ్రపుకొత్తూరులో 108 వాహనాన్ని 108 సేవల డివిజనల్‌అధికారి జి.జగన్ తనిఖీచేశారు. అంబులెన్స్‌లో పరికరాలు ఎలా పనిచేస్తున్నాయి, నిల్వఉన్నమందుల వివరాలపై ఆరాతీశారు. ఆయన వెంట సిబ్బంది పేడాడ గోపి, డి. రాజేష్ ఉన్నారు.

31 నుంచి అండర్-19 క్రికెట్ పోటీలు

టెక్కలి:అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ పోటీలు ఈనెల 31 నుంచి జూన్ ఐదో తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకపటలో తెలిపారు. కె.కొత్తూరుదరి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

రేపు రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

టెక్కలి:టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-18 రగ్బీ బాలబాలికలు జిల్లా జట్ల ఎంపికలు శనివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు డొంకాన రామకృష్ణ, కార్యదర్శి పొన్నాడ పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈనెల 30, 31 తేదీల్లో భీమిలి సమీపంలో జరగనున్నాయని పేర్కొన్నారు. వివరాలకు రగ్బీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు 8500007272 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు. ఎంపికలకు 2006 నుంచి 2008 సంవత్సరం మధ్యలో జన్మించిన వారు అర్హులు కావడంతో ఆధార్‌కార్డుతో హాజరు కావాలని తెలిపారు.

27న బొడ్డపాడులో సంస్మరణ సభ

పలాస రూరల్:బొడ్డపాడులో శ్రీకాకుళం నక్సల్‌బరీ ఉద్యమం, గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను అర్పించిన అమరవీరులను స్మరించుకునేందుకు ఈనెల 27న సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు స్మారక కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం బొడ్డపాడులో సంస్మరణసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్మారక కమిటీ సభ్యులు ఎం.మల్లేశ్వరరావు,టి.సన్యాసిరావు, రామారావు, దుష్యంత్, పి.కుసుమ, గొరకల బాలకృష్ణ, పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థికి సాయం

నందిగాం: లఖిదాసుపురం ఉన్నతపాఠశాలలో పదోతరగతి విద్యనభ్యసించిన ప్రత్యేకావసరాలు గల విద్యార్థి బాలక శ్రీరామ్‌చరణ్‌కు రాజ మండ్రి డీఈవో కె.వాసుదేవరావు ఆర్థికసాయం చేశారు. టెక్కలి ఉపవిద్యాశాఖాధికారిగా వాసుదేవరావు పనిచేసే సమయంలో శ్రీరామ్ చరణ్‌ను ఆయన దత్తత తీసుకున్నారు. మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో ఉన్నత చదువులు నిమిత్తం ఐదు వేలు ప్రకటించారు. ఈ మేరకు గురువారం విద్యార్థి స్వగ్రామం దిమిలాడ వెళ్లి హెచ్ఎం సీహెచ్‌కృష్ణారావు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక రామారావు, దుంపా శ్రీనివాస్, కుప్పిలి ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

మెళియాపుట్టి:మెళియాపుట్టి రెడ్డికివీధికి చెందిన ఇంద్రజ ఇటీవల విడుదలచేసిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో ఐదో ర్యాంకు రావడంతో గ్రామస్థులు, కూటమి నాయకులు అభినందించారు. కార్యక్రమంలో బసవ బాస్కరరెడ్డి, పరమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధపౌర్ణమి వేడుకలు

కొత్తూరు:పొన్నుటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం దార్ల కృష్ణారావు అధ్యక్షతన బుద్ధపౌర్ణమి వేడుకలు పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు పారిశెల్లి రామరాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం పదోతరగతిలో టాపర్స్‌కు నగదుపురస్కారం, జ్ఞాపిక బహుకరించారు. కార్యక్రమంలో ఎద్దు సంతోష్, కె.సురేష్, బి.అప్పారావునాయుడు, వి.శేఖరరావు, పి.శేఖర్‌రరావు, ఉపాధ్యాయులు ఎ.రాజేష్, బి.కృష్ణారావు, డి.మోహన్‌రావు పాల్గొన్నారు.

బంకులకు నోటీసులు

హిరమండలం: పెట్రోల్ బంకులకు వచ్చిన వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ ఇవ్వాలని, సీసాలు, క్యాన్లలో పెట్రోల్ ఇవ్వవద్దని మండలంలోని అన్ని పెట్రోల్ బంకుల వద్ద పోలీసులు నోటీసులు అంటించారు. పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఈ నిబంధన కొనసాగుతుందని బంకు యజమానులు చెప్పారు.

పచ్చిరొట్ట విత్తనాలు అమ్మకానికి సిద్ధం

నందిగాం: రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పది కిలోల జీలుగు, కట్టెజనుము రకంవిత్తనాలు రూ.440, ఎనిమిది కిలోల పిల్లిపెసర బ్యాగురూ.536 చొప్పున్న విక్రయించనున్నట్లు పేర్కొన్నారు.కావాల్సిన రైతులు ఆర్బీకేను సంప్రదించి పేర్లు నమోదు చేసుకొని నగదు వీఏఏలకు చెల్లిస్తే విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సెల్ఫ్‌సెంటర్ కేటాయింపుపై ఫిర్యాదు

నరసన్నపేట: నరసన్నపేటలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి నిబంధనలు విరుద్ధంగా సంపత్‌సాయి జూనియర్ కళాశాలకు సెల్ఫ్‌సెంటర్‌ను కేటాయించారని మిగతా జూనియర్‌కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్‌కు ఫిర్యాదుచేశాయి. ఆ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆదే కళాశాల పరీక్ష కేంద్రం కేటాయించడం సరికాదని, కేంద్రాన్ని మార్చాలనిపట్టణంలో జ్ఞానజ్యోతి, ఎంఎల్‌ఆర్ నాయుడు, పద్మావతి, శాంతి యూనియర్ కళాశాలలు యాజమాన్యాల ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు కోరారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇన్విజిలేటర్లు కూడా అదే కళా శాలకు చెందిన అధ్యాపకులను నియమించడంపై ఆర్ఐవో, డీవీఈవోలకు , ఇంటర్ బోర్డు సెక్రటరీకు ఫిర్యాదులు చేశామని తెలిపారు.

పారిశుధ్య పనులు చేయాలి

మందస:మందస మెయిన్‌రోడ్డు ఆటోస్టాండు ఆవరణలో పారిశుధ్య పనులుచేపట్టాలని సీఐటీయూ నాయకుడు ఆర్.దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. చెత్త పేరుకుపోతున్నా కనీసం శుభ్రం చేయడం లేదని, పారిశుధ్య పనులు చేసి బ్లీచింగ్ చేపట్టాలని తెలిపారు.

నరసన్నపేటలో వైభవంగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు



బ్రహోత్సవాల్లో కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

నరసన్న పేట:నరసన్నపేటలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని రుత్వికులు సుప్రభాత సేవతో స్వామివారిని మేలుకొలుపారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి మూలవిరాట్‌నువజ్రకవచాలతో అలంకరించారు. శ్రీనివాసుని దర్శనంకోసం ఉదయం నుంచి భక్తులు బారులుతీరారు. పూజల్లో హిందూ ప్రచార సారధి రాధా మనోహరదాస్, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.స్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి పట్టణవీధుల్లో తిరువీధి నిర్వహించారు. వేలాదిమంది భక్తులు హాజరుకావడంతో నరసన్నపేట కిటకిటలాడింది. తిరువీధుల్లో గజ, అశ్వక, ఒంటెలతోపాటు కూచిపూడి, భరతనాట్యం, కోలాటాలు, తప్పెటగుళ్ల, కేరళ సంప్రదాయ వాయిద్యాకారుల సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.

ఎల్.ఎన్.పేటలో బంగారు సంతోషిమాత మహోత్సవం



కలశాలతో మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న మహిళలు

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేటలో బంగారుసంతోషిమాత మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం మహిళలు కలశాలతో తీసుకు వెళ్లి గ్రామదేవతకు ముర్రాటల సమర్పించి చల్లదనంచేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవత కరుణించేందుకు సామూహికంగా మొక్కులు చెల్లిస్తున్నట్లు గ్రామస్థులు ఎం. జనార్ధనరావు, వి. పాండురంగనాథరాజు, ఎం. దివాకర్‌నాయుడు, డి. తిరుమలరావు తెలిపారు. ఈనెల 28 వరకు గ్రామదేవత మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

శ్రీముఖలింగేశ్వరునికి ఏకాంత సేవ

జలుమూరు: శ్రీముఖలింగంలో శ్రీముఖలింగేశ్వర స్వామికి గురువారం ఏకాంతసేవ అర్చకులు నిర్వహించారు. వైశాఖమాసం పౌర్ణమి పురస్కరించుకొని ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో మేల్కొపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. సాయంత్రం గర్భగుడిలో గల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బయటకు తీసుకువచ్చి అలంకరించి పూలమాలలు ధరించి పల్లకిలో ఆసీనులనుచేశారు. మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి పూజలు చేసి యథాస్థానానికి చేర్చారు. ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు ఏకాంతసేవ చేపట్టి అష్టదిక్పాలకుల సేవతోపాటు ఊయల్లో పవళింపు సేవ చేశారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, అప్పారావు, వెంకటాచలం, శ్రీకృష్ణ పాల్గొన్నారు.



శ్రీముఖలింగేశ్వరునికి ఊయలలో పవళింపు చేస్తున్న అర్చకులు

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపునకు సర్వే

నందిగాం: మండలంలోని ప్రత్యేకావసరాలు పిల్లలగుర్తింపునకు సర్వే చేపట్టారు.ఈమేరకుగురువారం ఐఈడీ ఉపాధ్యాయులు పినకాన రాణి, రామారావు పలుగ్రామాల్లో సర్వే జరిపారు. అలాగే నందిగాం సచివాలయ విద్య సంక్షేమ సహాయకులు ప్రత్యేకావసరాలు పిల్లల గుర్తింపుపై సూచనలు చేశారు.

వైశాఖ పౌర్ణమి పూజలు

పలాసరూరల్: తర్లాకోట, రెంటికోట, పండాశాసనం, బ్రాహ్మణతర్లాతోపాటు పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఒడియాబ్రాహ్మణుల ఆధ్వర్యంలో సంతానసౌభాగ్యంకోసం వైశాఖపౌర్ణమి పూజలను గురు వారం నిర్వహించారు. తులసీకోటవద్ద చంద్రుడినిచూసిన అనంతరం పిండి వంటలు, తాటి ముంజెలు, మామిడీ, ఈతపళ్లను సమర్పించిమహిళలు పూజలు చేశారు. తర్లాకోటలో కూర్మ జయంతి పూజలను జగన్నాథుడు ఆలయంలో చేపట్టారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... పలాస బ్రాంచ్ వారి తరఫున ఇవ్వబడుచున్న పబ్లిక్ నోటీసు. ...

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s. SHRIRAM FINANCE LIMITED ...

మృతుల కుటుంబాలకు పరామర్శ



ఎ.బొడ్లూరులో పరామర్శిస్తున్న గౌతు శివాజీ

హరిపురం: మందస మండలంలో ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు గౌతు శివాజీ గురువారం పరామర్శించారు. బిడిమి, ఉగ్రవాణిపేట, అంబుగాంబొడ్లూరులో టీడీపీ నాయకులు లబ్బనారాయణ,డొక్కరి దానయ్య, మడియా లక్ష్మమ్మ, బొడ్డు నీలకంఠం కుటుంబాలను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు భావన దుర్యోధన, కోనారి తులసీరావు, బమ్మిడి కర్రయ్య, జుత్తు అమ్మినాయుడు, జుటియా హరికృష్ణ, బొడ్డు తిరుపతి, బత్తిని కృష్ణారావు, దున్న పురుషోత్తం పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ



సీఆర్‌పీపై తైక్వాండో క్రీడాకారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలిలోని ఎన్టీఆర్ క్రీడాకారుల వికాస్ కేంద్రంలో తైక్వాండో క్రీడాకారులు, కుటుంబసభ్యులకు గురువారం ఇండియన్ ఎమర్జెన్సీ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రవి కుమార్‌రెడ్డి క్రీడాకారులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. గుండె పోటు వచ్చిన వ్యక్తిని ఎలా రక్షించాలి, అంబులెన్స్ చేరేలోపు ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని ప్రాణాలను రక్షించాలి, ఎమర్జెన్సీ సమయంలో ఏ ట్యాబ్లెట్ ఇవ్వాలి, ఊపిరి ఎలా అందించాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో డాక్టర్ కళ్లేపల్లి శ్రీధర్, తైక్వాండో కోచ్ నర్సిపురం శేఖర్, క్రీడాకారులు కోనారి గోపి, బి.గేయామృత, ఆర్.హాసిని, ఆర్.సాగర్, గణేష్ పాల్గొన్నారు.

జనావాసంలో మురుగు నీరు

పలాస రూరల్: మండలంలోని కిష్టుపురంలో ప్రధానరహదారిపై జనావాసంలో మురుగు, ఇళ్లలోని మురుగుదొడ్ల నీరు రోడ్డుపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పదిరోజులుగా నీరు రోడ్డుపైకి చేరుతుండడంతో దుర్వాసన వెలువడుతోంది. రోడ్డుపైన లెట్రిన్ నీరు,మురుగునీరుబయటకు వెళ్లేలా కాలువలు లేకపోవడంపై కార్యదర్శికి తెలియజేసినా స్పందించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు.వీధిగుండా నడవలేనివిధంగా రోడ్డు తయారైందని, దుర్గంధపూరిత వాతావరణంఉండడంతో రోగాలు వ్యాపించే అవకాశముందని పాదచారులు వాపోతున్నారు. రోజుల తరబడి మురుగు నీరునిల్వ ఉన్నా పంచాయతీ అధికారులు చోద్యంచూస్తున్నారని యువకులు ఆరోపిస్తున్నారు.



కిష్టుపురంలో జనావాసాల మధ్యలో రహదారిపై చేరిన మురుగునీరు

బహిరంగ ప్రకటన

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాకుళం-II వారి తరఫున ఇవ్వబడుచున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, ... శ్రీ/శ్రీమతి జుత్తు హేమవతి W/o లేటు జయరాం ...

డి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్, డోర్ నెం.11-6-59, శ్రీకాకుళం, సెల్: 9247315759

బహిరంగ ప్రకటన

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాకుళం-II వారి తరఫున ఇవ్వబడుచున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, కాశీబుగ్గ గ్రామ కాపురస్థులైన శ్రీ/శ్రీమతి మార్పు దుర్యోధనరావు S/o జగన్నాయకులు ...

డి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్, డోర్ నెం.11-6-59, శ్రీకాకుళం, సెల్: 9247315759

బహిరంగ ప్రకటన

డి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్, డోర్ నెం.11-6-59, శ్రీకాకుళం, సెల్: 9247315759





బిల్లులు రాక.. పనులు పూర్తి కాక

● ప్రారంభానికి నోచుకోని శాలిహుండం రైతు భరోసా కేంద్రం



బిల్లులు చెల్లించాల్సిన శాలిహుండంలో ఆర్బీకే భవనం

గార: శాలిహుండం గ్రామ సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రభవనం (ఆర్బీకే) బిల్లులకోసం కాంట్రాక్టరు ఎదురుచూస్తున్నారు. రూ.22 లక్షలతో నిర్మిస్తున ఈభవనంలో ఫ్లోరింగ్‌తోపాటు చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. బిల్లులు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు వల్ల మిగిలిన పనులకు కాంట్రాక్టర్ ఆసక్తిచూపడం లేదని సమాచారం. దీంతో భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ ఆర్బీకేపరిధిలో శాలిహుండం, కొత్తపేట, కొంక్యానపేట, తంగుళ్లపేట, వేణుగోపాలపురం గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులకు సేవలందాల్సిఉంది. ఈభవనం ప్రారంభంకా కపోవడంతో రైతులు వ్యవసాయానికి సంబంధించి పలు సలహాలు, సందేహాలకోసం సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కాగా కాంట్రాక్టరుకు బిల్లు చెల్లింపులో జాప్యం జరిగిందని మండల ఇంజనీరింగ్ అధికారి నక్క చక్రధరరావు తెలిపారు. ఎన్నికల తర్వాత మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.





వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు

- పల్లె, పట్టణాల్లో జల్లెడ పడుతున్న పోలీసులు
- క్షుణ్ణంగా తనిఖీలు

సార్వత్రిక ఎన్నికలు పూర్తయినా రాష్ట్రంలో కొన్ని చోటు చేసుకున్న అల్లర్ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు జల్లెడపడుతున్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఎక్కడా దాడులు, వివాదాలకు అవకాశం ఇవ్వకూడదనే ఆలోచనతో ముందస్తుగా విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. అపరిచితులు ఎవరైనా తారసపడితే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆమదాలవలస: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ దురుద్దేశాలతో వివాదాలు సృష్టించే వ్యక్తుల పై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.వెంకటేష్ హెచ్చరించారు. గురువారం ఆమదాలవలస మున్సిపాలిటీ 14వ వార్డు ఐజీ నాయుడు కాలనీలో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్, పోలీస్ ఫ్లాగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఎటువంటి పత్రాలు లేని మూడు వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ వెంకటేష్ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన చిన్నపాటి మన స్పర్థలను మరిచిపోయి ఎప్పటిలాగానే ఐకమత్యంగా ఉండాలన్నారు. కొంతమంది కావాలనే రాజకీయ లబ్ధి కోసం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు.

ఆరంగిపేటలో..

గార: ఆరంగిపేటలో గురువారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు కదలికలపైనా, పేలుడు, మత్తు పదార్థాలపై ఆరా తీశారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలపై విచారించారు. ఎస్‌ఐ కె.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ఎలాంటి వివాదాలకు తావులేకుండా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ జి.నారాయణస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. హిరమండలం ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్‌ఆర్ కాలనీలో తనిఖీలు నిర్వహించారు. కాలనీ పరిసరాలను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈయనతో పాటు కొత్తూరు పీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తగాదాలకు తావివ్వొద్దు

జి.సిగడాం: ఎన్నికలు లెక్కింపు దృష్ట్యా ఎటువంటి తగాదాలకు తావివ్వొద్దని ఎస్‌ఐ వై.మధుసూ దన రావు అన్నారు. గురువారం డీఆర్ వలస, సర్వేశ్వర పురం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లు లెక్కింపు అనంతరం గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా శాంతియుతంగా మెలగాలన్నారు. గొడవలు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. రాజకీయ నాయకుల కోసం తమ గ్రామాల్లో విభేదాలు పెంచుకోకుండా ప్రశాంత వాతావరణాన్ని కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ రామకృష్ణ, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



జి.సిగడాం: సర్వేశ్వరపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మధుసూధనరావు



ఆమదాలవలస: పట్టుబడిన వాహనాలతో పోలీసులు



గార: ఆరంగిపేటలో తనిఖీలు చేస్తున్న పోలీసులు



హిరమండలం: ఆర్‌ఆర్ కాలనీలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ

ఘనంగా అన్నమాచార్యుల జయంతి

శ్రీకాకుళం కల్చరల్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 616వ జయంతి కార్యక్రమం నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కత్తెరవీధిలో ఉన్న రాజరాజేశ్వరి పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, స్వరార్చన గ్రూప్ అధ్యక్షుడు సింహాద్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పీఠంలో అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మంగళధ్వని, రాజరాజేశ్వరి సంగీత విద్యాలయం విద్యార్థులచే అన్నమాచార్య సంకీర్తన, విశాఖకు చెందిన ప్రీతీ, ఆర్.మహతిచే యుగళ, కర్ణాటక, శాస్త్రీయ అన్నమాచార్య సంకీర్తనార్చన నిర్వహించారు. అనంతరం యువటూరు కృష్ణశృతి, సుసరాపు కుమార విగ్నేష్‌చే మృదంగం వాయించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు బండారు చిట్టిబాబు, మావుడూరు సత్యనారాయణ శర్మ, కరి యామిని, కృష్ణ, కేవీఎన్ మూర్తి, మార్గదర్శి శ్రీనివాసరావు, పెంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: కేంద్ర గ్రంథాలయంలో అన్నమాచార్యుల కీర్తనల్లో గాయకులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అన్నమాచార్య జయంతి ఉత్సవం తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్, శృతిలయ సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ మండ శ్రీనివాసరావు, ట్రస్టీలు వెంకటరమణమూర్తి, గణేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, దొర జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ సంగీత సంస్థలకి చెందిన కళాకారులు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. వీరికి హార్మోనియంపై రెడ్డి సత్యనారాయణ, వాయులీనంపై ధనుంజయ రెడ్డి, మృదంగంపై శ్రీనివాసరావు, వినోద్, సాయి చరణ్ సహకరించారు. టి.కొండలరావు, శాక్సఫోన్ వాయిద్యంతో నాద నీరాజనం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జి.పవన్ కుమార్, వెంకటేశ్వరి, శ్రీచరణ్ పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల: శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 616 జయంతోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలో గురువారం ఉదయం నగర సం కీర్తన జరిగింది. ఎచ్చెర్లలోని శ్రీనివాస ప్రార్థనా మందిరం నుంచి గ్రామ పుర వీధుల్లో స్వామి చిత్ర పటాలతో తిరువీధి నిర్వహించారు. స్వామివారి గోవిందనామాలు, అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అలాగే ప్రార్థనా మందిరంలో సాయంత్రం సప్తగిరి సంకీర్తనలు, గిన్నీస్ బుక్‌లో మూ డు సార్లు నమోదైన డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్య బృందంచే అన్నమయ్య పదనార్తన శోభ అనే కూచిపూడ నృత్యం ప్రదర్శించారు. ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు ఆదిమూలం వెంకటపతి దాసు, ఎస్‌పీవీ రమణ, మెండ నీలంకుమార్, ధనాలకోటి రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

గార: గార మండలం కె.మత్స్యలేశంలో ఇటీవల మృతి చెంది అవయవదానం చేసిన పప్పు సుశీల కుటుంబ సభ్యులకు గురువారం నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి పరామర్శించారు. అలాగే తాన్‌సాహెబ్ పేటలో అనారోగ్యంతో మరణించిన చీపురు సురేష్ కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలియజేశారు. టీడీపీ నాయకులు పి.కృష్ణమూర్తి, పి.వైకుంఠరావు, టీఎస్ఎన్ ప్రసాద్, జేసీ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.



సుశీల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న స్వాతి

దివ్యాంగ పిల్లలపై స్పెషల్ డ్రైవ్

సరుబుజ్జిలి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దివ్యాంగ పిల్లలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రమైన సరుబుజ్జిలి గ్రామంలో విద్యాశాఖ సిబ్బందితో కలిసి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నుంచి 14 ఏళ్ల వయస్సు గల దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి ఐఈఓడీ ఆధ్వర్యంలో విద్యాభ్యాసన జరుగుతుందన్నారు. సరుబుజ్జిలి గ్రామానికి చెందిన పేకాన రాజేష్ బుద్ధిమాన్యం, వైకల్యం ఉన్న విద్యార్థిని గుర్తించామన్నారు. ఈ సర్వేలో సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులు బి.సాయిరాం, ఐఈడీ టీచర్లు ఎస్.డిల్లీశ్వరరావు, కె.అలేఖ్య, సీఆర్‌ఎంటీ బెండి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలిలో సర్వే చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది



వైభవంగా పుష్పయాగం

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో కల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో భూసమేతంగా వేంకటేశ్వరస్వామికి అలంకరణ చేసి పుష్ప కవచ దర్శనం భక్తులకు కల్పించారు. మండపారాధనలు, హోమాలు, చూర్ణోత్సవం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అన్నబృదస్నానం, అభిషేకం నిర్వహించారు. వేంకటేశ్వరులు పద్మావతి అమ్మవారులకు బంతి, చామంతి, సన్నజాజి, గులాబీ, లిల్లి, కాగడాలు, తులసి మాలలతో పుష్పయాగం చేపట్టారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

డ్రైనేజీలో పడి ఒకరి మృతి

హిరమండలం: మండల కేంద్రం హిరమండలంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి డ్రైనేజీలో పడి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ జి.నారాయణ స్వామి తెలిపిన వివరాల మేరకు.. హిరమండలం మేదరవీధికి చెందిన తెల్లి మల్లేశ్వరరావు(44) బస్టాండ్ వద్ద ఉన్న ఓ హోటల్ పనిచేస్తుండేవాడు. బుధవారం చిన్నకోరాడవీధి చివర ఉన్న డ్రైనేజీ ఖానా మీద కూర్చొని మద్యం మత్తులో వెనుకకు తూలడంతో మురుగు కాలువలో పడిపోయాడు. గురువారం ఉదయం స్థానికులు మురుగు కాలువలో మృతదేహాన్ని గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ముఖం బురద నీటిలో మునగడం వల్ల ఊపిరాడక చనిపోయాడు. మల్లేశ్వరరావుకు భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం అయోధ్య రామాలయం యాత్రలో ఉన్నారు. అతడి సోదరుడు తెల్లి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గోకర్ణపల్లి ఎన్నికల వివాదంలో 28 మంది అరెస్టు

పొందూరు: గోకర్ణపల్లి గ్రామంలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న కొట్లాటకు సంబంధించి 28 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వై.రవికుమార్ తెలిపారు. గోకర్ణపల్లిలో జరిగిన కొట్లాటలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధ, గురువారాల్లో 28 మందిని అరెస్టు చేసి శ్రీకాకుళం కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించడంతో వారిని జైలుకు తరలించినట్టు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

కంచిలి: మండలంలోని తలతంపర-1 సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు చెందిన ద్విచక్ర వాహనం గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు నివాసముంటున్న వంకలవీధి ఆవరణలో ఈ నెల 12న పార్కింగ్ చేసి ఎన్నికల విధులకు వెళ్లాడు. విధులను నిర్వహించి వచ్చిన అనంతరం పరిశీలించగా వాహనం లేదు. దీంతో బుధవారం విజయ్‌కుమార్ ఫిర్యాదుపై కంచిలి పోలీసులు కేసు నమోదు చేశారు.

శిక్షణ డ్రైవర్లకు ధ్రువపత్రాలు



ధ్రువపత్రాలు అందుకున్నవారితో డీపీటీవో విజయకుమార్

అరసవల్లి: ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్న 15వ బ్యాచ్ డ్రైవర్లకు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ ధ్రువపత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతీ ఒక్కరూ భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ వారంలో 16వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని, లైట్ వెహికల్ లైసెన్సు కలిగి, ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 40 రోజుల శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు సంబంధించి ఫీజు, ఇతర వివరాల కోసం 99630 91999, 73829 23293 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులపై సర్వే

కవిటి: మండలంలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్టు సహిత ఉపాధ్యాయులు కృష్ణారావు, అరుణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కళింగపట్నం, కుసుంపురం, చిన్నబల్లిపుట్టుగ, దూగానపుట్టుగ, మునిపుట్టుగ గ్రామాల్లో సర్వే నిర్వహించామన్నారు. మండలంలో ఇప్పటివరకు 18మంది ప్రత్యేక అవసరా లు గల పిల్లలను గుర్తించటం జరిగిందన్నారు. జిల్లా సహితవిద్య సమన్వయకర్త బి.గోవిందరావు, ఎంఈవో ధనుంజయ మజ్జి పర్యవేక్షణలో సర్వే చేపడుతున్నామని తెలిపారు.



కళింగపట్నంలో సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

కులాల మధ్య గొడవలు పార్టీలపైకి నెట్టొద్దు



మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకుడు విక్రమ్

బూర్జ: కులాల మధ్య గొడవలు తీ సుకొని పార్టీ లోకి నెడితే సహించేది లేదని జన సేన నాయ కులు, ఎంపీ టీసీ విక్రమ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీలవ అన్నంపేటలో ఇద్దరు మధ్య జరిగిన తగాదాకు పార్టీల పేరు పెట్టి కొంతమంది వైసీ పీ గూండాలు ఆయా కుటుంబాల మధ్య చిచ్చుపెట్టి నీచ రాజకీయాలకు పాల్పడ డం సరికాదన్నారు. వారి మధ్య జరిగిన గొడవను సరిచేయాల్సి పోయి పార్టీ పేర్లు పెట్టి గొడవను పెద్దది చేసి వారి జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. సమావేశంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

గార: వైశాఖ పూర్ణిమ సందర్భంగా గురువారం ఉదయం పలు షిర్డీ సాయి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయాన్నే బాబాను దర్శించి హారతులు పట్టారు. కళింగపట్నం, గార, బూరవెల్లి, బోరవానిపేట, అంబళ్లవలస, కొయ్యానపేట, బందరువానిపేట తదితర గ్రామాల్లో భక్తులు బాబాను దర్శించి పూజలు నిర్వహించారు.



బూరవల్లిలో షిర్డీ సాయికి పుష్పాలంకరణ

నేడు సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి మండలంలో గల అన్ని శాఖల అధికారులు తమ వద్దనున్న నివేదికలతో విధిగా హాజరు కావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: మండల పరిధిలో గల పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ గోవిందరావు ప్రకటనలో తెలిపారు. ఈదుపురం, కొళిగాం సబ్‌స్టేషన్ 33కేవీ ఫీడర్ పరిధిలో గల ఈదుపురం, డొంకూరు, కేశుపురం, బిర్లంగి, కొళిగాం, బి.తోటూరు, తేలుకుంచి, ధర్మపురం, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

జి.సిగడాం పరిధిలో రేపు..

జి.సిగడాం: స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో పరిధిలోగల పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, ఏఈ ఆర్.తిరుపతిరావు తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాకు కలుగుతుందని వారు తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గల దవళపేట, అనందపురం, సంతవురిటి, పాలఖండ్యాం, మెట్టవలస తదితర గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

సరుబుజ్జిలి మండల సమావేశం రేపు

సరుబుజ్జిలి: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీ శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.రత్నం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని ఆదేశించారు.

సోంపేటలో 144 సెక్షన్

సోంపేట: మండలంలో 144 సెక్షన్ విధించినట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో అలజడుల నేపత్యంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకు సెక్షన్ అమలులో ఉంటుందని, హద్దుమీరితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహన్ ఎన్‌ఐసీతో ఈ-ప్రగతి సేవలు

శ్రీకాకుళం క్రైం: ఈ నెల 22 నుంచి ఈ-ప్రగతి సేవలు నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు 23వ తేది నుంచి వాహన్ ఎన్‌ఐసీ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు రవాణా శాఖ కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన యాజమానులకు ఏమైన ఇబ్బందులు ఉంటే వారి వాహన ధ్రువ పత్రాలతో జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ కోరారు.

జాబ్‌మేళాలో ఏడుగురి ఎంపిక

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఏడుగురు ఎంపికయ్యారు. మానాపురం ఫైనాన్స్ (శ్రీకాకుళం) నిర్వహించిన ఈ ఎంపికల్లో వర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన 167 మంది హాజరుకాగా, ఏడుగురిని ఎంపిక చేశారు. సేల్స్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించి వీరికి నెలకు రూ.17 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్, సంస్థ ప్రతినిధి ఆదిత్య పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని దర్శించుకున్న ఇస్కాన్ ప్రచారకులు



గార: ఇస్కాన్ ప్రచారకులు, ఆధ్యాత్మిక ప్రవచకులు, రాధామనోహరదాస్ గురువారం ఉదయం బూరవెల్లిలో ప్రసిద్ధ లక్ష్మీ నృసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సీతారామస్వామి, ఆనంద్ కాశ్యప్.. స్వామివారి శేషవస్త్రాన్ని సమర్పించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన రాధామనోహర్‌దాస్ ఆలయంలో భక్తి గీతాలు ఆలపించారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర విశిష్టతను అర్చకులు సీతారామ స్వామి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేష్‌బాబు, రమేష్‌బాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

← ఆలయ అర్చకులతో రాధామనోహరదాస్

పెచ్చులూడుతున్న శ్లాబ్

- ఎంపీడీవో కార్యాలయంలో పరిస్థితి
- భయపడుతున్న ప్రజలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మండల పరిషత్ కార్యాలయం వరండా శ్లాబ్ పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారినా అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. శ్లాబ్ శిథిలావస్థకు చేరడంతో పెచ్చులు ఊడుతున్నాయి. ప్రతీ రోజూ కార్యాలయానికి వచ్చే అధికారులతో పాటు ప్రజలు కూడా పెచ్చులూడి తలలపై పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్లాబ్ మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

